వడ్డీ డబ్బులు మింగాడు!

- అడిగితే ఎవరికైనా చెప్పుకోండి అంటున్నాడు
- పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవో మోసం చేశాడు
- పురుగుల మందు డబ్బాతో రైతుల నిరసన

పీఏసీఎస్ ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతులు

శాయంపేట, జూన్ 18 : కల్లబొల్లి మాటలు చెప్పాడు.. వడ్డీ కడితే లోన్ ఇస్తామని బుకాయించాడు.. తీరా వడ్డీ డబ్బులు చెల్లించాక లోన్ డబ్బుల్లో కలిపి వచ్చింది.. వడ్డీ డబ్బులు కడితే రసీదులు కూడా ఇవ్వలేదు.. అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ శాయంపేట పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవో మోసం చేశాడని రైతులు ఆందోళన బాటపట్టారు. బుధవారం పీఏసీఎస్ ఎదుట పురుగుల మందు డబ్బాతో మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రైతులు రేణికుంట్ల పృథ్వీరాజ్, కోగిల సదానందం, చిట్టి సాంబయ్య నిరసన చేపట్టారు. పీఏసీఎస్‌లో 2024లో రుణం పొందినట్లు తెలిపారు. ఇన్‌చార్జి సీఈవో 8 నెలల వడ్డీ కడితే కొత్త రుణం ఇస్తానని చెప్పారు. ముగ్గురు రూ.10వేల చొప్పున పాత వడ్డీని ఇన్‌చార్జి సీఈవోకు చెల్లించారు. ఇన్‌చార్జి సీఈవో పృథ్వీరాజ్‌కు రూ.80వేలు, సదానందంకు రూ.1.50 లక్షలు, సాంబయ్యకు రూ.60 వేలు రుణం మంజూరు చేయించారు. అయితే కట్టిన వడ్డీ డబ్బులకు ఎలాంటి రసీదులు ఇవ్వలేదు. ఇన్‌చార్జి సీఈవో సొంతానికి వాడుకున్నాడని వారు ఆరోపించారు. లోన్ అమౌంట్‌లో వడ్డీ డబ్బులు కూడా కలిసి రావడంతో అవాక్కయ్యామన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలు అదనంగా లోన్ అమౌంట్ చూపుతోందని చెప్పారు. తన వద్ద రూ.25 వేలు అదనంగా తీసుకున్నట్లు పృథ్వీరాజ్ ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి సీఈవోను అడిగితే తనకు వడ్డీ డబ్బులు ఇవ్వలేదని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటున్నాడని బాధితులు వాపోయారు. దీంతో డీసీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కానీ ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కాలయాపన చేస్తున్నారని, డీసీవో, నోడల్ అధికారి ఇన్‌చార్జి సీఈవోకు అనుకూలంగా ఉంటూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, విషయం తెలుసు కొన్న పోలీసులు అక్కడికి చేరుకొని పురుగుల మందు డబ్బాతో నిరసన చేస్తున్న రైతులను తరలించారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలి

- గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- నర్సరీ, డంపింగ్ యార్డ్, స్మార్ట్‌సిటీ పనుల తనిఖీ

రాంపూర్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్, జూన్ 18 : వన మహోత్సవ లక్ష్యానికి తగ్గట్లుగా మొక్కలను సిద్ధంగా ఉంచాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రేటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు, డంపింగ్ యార్డ్, కుక్కలకు శస్త్రచికిత్స సెంటర్, స్మార్ట్‌సిటీ పనుల నాణ్యతను పరిశీలించారు. హోమ్ స్టేట్ మొక్కల పంపిణీలో భాగంగా ప్రతి ఇంటికి ఒక పూల మొక్క అందజేయాలన్నారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న సెంట్రల్ మీడియంలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కుక్కల శస్త్రచికిత్స కేంద్రంలో ప్రతి రోజు ఎన్ని కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోకుల్ నగర్, రాజాజీ నగర్‌లో రోడ్డు, డ్రైనేజీలు, రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. పైడిపల్లి, మడికొండ ప్రాంతాల్లో పూర్తయిన రోడ్డు పనుల బిల్లుల చెల్లింపుల కోసం నాణ్యతతో పాటు కొలతలు వేసి వాస్తవికతను నిర్ధారించారు. రాంపూర్‌లోని డంపింగ్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్‌ను పరిశీలించారు. వారం రోజుల్లో చెత్తను డిస్‌పోజ్ చేస్తామని తెలిపారు. 45వ డివిజన్‌లో నాలాల పూడికతీత పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు సూచించారు. సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, సంతోష్ బాబు, ఎంహెచ్‌వో రాజేశ్, హార్టికల్చర్ అధికారి రమేశ్, వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలి..

నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో చేపట్టిన పనులు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్‌సిటీ పనుల చెల్లింపులపై వివరాలు అడిగారు. డీఈ, ఏఈ పరిధిలో ఎన్ని డివిజన్లు, పనులు ఉన్నాయని వాకబు చేశారు. ఎలక్ట్రికల్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల పనితీరు వారి జాబ్ చాట్ అడిగారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మాధవీలత, స్మార్ట్‌సిటీ పీఎంవో ఆనంద్ వోలేటి పాల్గొన్నారు.

40వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో ఎక్కువ మురికివాడలు ఉన్న 40వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. బుధవారం కార్పొరేషన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డివిజన్ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కాలనీల్లో మట్టి రోడ్లు ఉన్నాయని, ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ డివిజన్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు.

తప్పు చేసిన పోలీసు అధికారులను తప్పించాలి

వరంగల్, జూన్ 18 : ఏ పదవి లేకున్నా మంత్రి భర్త హోదాలో కొండా మురళీధర్ రావుకు ఏసీపీ సహా సీఐలు బందోబస్తు సేవలు అందించడాన్ని వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన పోలీసుల వ్యవహారంపై ఒక ప్రకటన విడుదల చేశారు. కొండా మురళీధర్‌రావు అధికార కార్యక్రమాలతో పాటు విందులు, పెళ్లిళ్లకు వెళ్తే వరంగల్ ఏసీపీ, మిల్స్‌కాలనీ, మట్టెవాడ సీఐలు, ఎస్సైలు ఎస్కార్ట్‌గా వెళ్లడాన్ని తప్పుబట్టారు. పోలీస్ కమిషనర్ నోటీసులతో సరిపుచ్చుకోకుండా ఏసీపీ నందిరాం నాయక్‌తో పాటు పోలీసు అధికారులను తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య

ప్రవీణ్(ఫైల్)

శాయంపేట, జూన్ 18 : కుటుంబ కలహాలతో ఆర్మీ జవాన్ అరికిల్ల ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వేధింపులతో కొద్దిరోజుల క్రితం పురుగుల మందు తాగిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతడి అన్న అరికిల్ల ప్రసాద్ కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ప్రవీణ్ తిరుమలగిరి టెరిటోరియల్ ఆర్మీ125 బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన రజినీకతో ఐదేళ్ల క్రితం అతడికి వివాహం జరిగింది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్యతో పాటు అత్తింటి వారు ప్రవీణ్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రవీణ్ డ్యూటీకి వెళ్లకుండా ఐడీ కార్డు దాచిపెట్టి వేధిస్తున్నారు. ప్రవీణ్‌పై అధికారులకు లేనిపోని విషయాలను చెప్పి భార్య పరువు తీసింది. దీంతో ప్రవీణ్ తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 6న మైలారంలోని ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో మాట్లాడి హనుమకొండకు వెళ్లి 8వ తేదీన గడ్డి మందు తాగి విషయాన్ని ప్రసాద్‌కు చెప్పాడు. వెంటనే అతడిని తిరుమలగిరిలోని మిలిటరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందినట్లు అన్న ప్రసాద్ తెలిపాడు. వాళ్ల టార్చర్ తట్టుకోలేకపోతున్నానని అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని సూసైడ్ లెటర్ రాసినట్లు ప్రసాద్ చెప్పాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపాడు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

నడికూడ/పరకాల/ఐనవోలు, జూన్ 18 : క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 19న నడికూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని ఎంఈవో హనుమంతరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, పూర్తి వివరాల కోసం 8106548121లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 20న పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఫిజికల్ పరీక్షలకు 8 నుంచి 9 సంవత్సరాలు ఉన్న విద్యార్థులు హాజరు కావాలని ఎంఈవో రమాదేవి తెలిపారు. వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ నెల 19న ఐనవోలు జడ్పీ పాఠశాలలో నిర్వహించే పోటీలకు హాజరు రావాలని ఎంఈవో పులి ఆనందం తెలిపారు. స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. అదే విధంగా tgss.telangana.gov.inలో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9966867149, 9603909729 సంప్రదించాలని కోరారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు

దామెర, జూన్ 18 : మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎంపీడీవో కల్పన హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమావేశం నిర్వహించారు. తక్కువ లేబర్ రిపోర్టు ఉన్న ఊరుగొండ, ల్యాదెళ్ల, తక్కళ్లపహాడ్, పసరగొండ గ్రామాల్లో ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో శారద, టీఏ సురేందర్ పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను వినియోగించుకోవాలి

ధర్మసాగర్, జూన్ 18 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ధర్మసాగర్‌లో నిర్మించిన డీసీసీ బ్యాంక్ బ్రాంచ్ నూతన భవనాన్ని బుధవారం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ముందుగా ముప్పారం కస్తూర్బాగాంధీ విద్యాలయం, గోదాం వరకు వెళ్లే సీసీ రోడ్డు, రూ. 3.50లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, ముప్పారం గ్రామంలో డ్రైనేజీ, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో గోదాం, డీసీసీ బ్యాంక్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీవో సంజీవరెడ్డి, సీఈవో వజీర్ సుల్తాన్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఏవో రాజేశ్ పాల్గొన్నారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో యోగాసనాలు

పోచమ్మమైదాన్, జూన్ 18 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యోగాసనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపం ఆవరణలో బుధవారం యోగా గురువు శ్రీనివాస్ వేణుశర్మ, సంస్కృత అధ్యాపకురాలు శ్రీవిద్య ప్రచార బ్యానర్ ఆవిష్కరించారు. నక్కలగుట్టలోని విబ్రాంత్ జూనియర్ కళాశాల, వరంగల్ పిన్నవారివీధిలోని శారద ఉన్నత పాఠశాల, భూపాలపల్లి జిల్లాలో కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాల, ములుగులోని అరవింద ఉన్నత పాఠశాల, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల విశ్వశాంతి ఉన్నత పాఠశాల, జనగామ జిల్లాలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్యాబినెట్‌లో యాదవులకు చోటు ఇవ్వకపోవడం సిగ్గుచేటు

- 30న యాదవుల ఆత్మగౌరవ సభ
- కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న సుందర్ రాజ్ యాదవ్

హనుమకొండ, జూన్ 18 : రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవ జాతికి క్యాబినెట్‌లో చోటులేకపోవడం సిగ్గుచేటని అఖిల భారత యాదవ సంఘం సభ్యుడు, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు లేరు అనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురిచేయొద్దన్నారు. ఈ నెల 30వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించే యాదవుల ఆత్మగౌరవ సభకు యాదవ బిడ్డలంతా తరలిరావాలని పిలుపునించారు. అఖిల భారత యాదవ సంఘం సభ్యుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. హిందూ ధర్మానికి భగవద్గీతను అందించిన జాతి యాదవ జాతి అని, తెలంగాణలో గోల్కొండ కోటను నిర్మించిందీ యాదవ జాతేనని గుర్తు చేశారు. జనాభా దామాషా పద్ధతిలో యాదవులకు రావాల్సిన నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిపిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలు లేకుండా బీసీలు 52శాతం ఉన్నారని, కానీ ఇప్పుడు ముస్లింలను కలుపుకొని 56శాతం బీసీలు ఉన్నారని చెప్పడం సిగ్గుచేటన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు మున్నూరు కాపులు కే కేశవరావు, డీఎస్ లాంటి వారు ఎంతో సేవ చేశారని చెప్పారు. మంత్రి మండలిలో బీసీ కులాల లెక్కన 9 మందికి చోటు కల్పించాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే యాదవ మంత్రి లేకుండా పాలన చేస్తున్న ఏకైక రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల సత్తా చాటుతామని హెచ్చరించారు. సమావేశంలో మేకల కృష్ణయాదవ్, గీరబోయిన రాజయ్య, మాదం రజినీ కుమార్, సిద్ధిరాజు, గండ్రకోట రాకేశ్, పృథ్వీ, ప్రమోద్, సాయి, రాజు, బండి పర్వతాలు పాల్గొన్నారు.

'సీఆర్పీఎఫ్ స్థలంలోనే పాఠశాల నిర్మించాలి'

హనుమకొండ చౌరస్తా, జూన్ 18 : కాకతీయ యూనివర్సిటీ సీఆర్పీఎఫ్ స్థలంలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సీఆర్పీఎఫ్ క్యాంపుకు కేటాయించిన స్థలంలో నిర్మించాలని, యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేయూ ప్రధాన కార్యదర్శి పవన్‌కల్యాణ్, దీక్షిత్‌రెడ్డి, శంకర్, మోక్షజ్ఞ, అన్వేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
jobs Apply Now!
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

CHANGE OF NAME
I, SAMALA RAMADEVI W/o RAMESH R/o. H.No: 4-17, Kothaguda village of Kothaguda Mandal, Mahabubabad District-506 135, TG. I have changed my name from RAMADEVI SHAMALA W/o RAMESH to SAMALA RAMADEVI W/o RAMESH for all future purposes.

CHANGE OF NAME
I, RAJIREDDY PATHURI S/o VENKAT REDDY R/o. H.No: 5-100/ 11 Vill & Mdl: NARMETTA, Dist: JANGAON, TG. I have changed my name from RAJU PATHURI S/o VENKANNA to RAJIREDDY PATHURI S/o VENKAT REDDY for all future purposes.

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK SEPTIC TANK CLEANING AND REPAIRING
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

BUSINESS OFFER
★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మంత్రి పొంగులేటిని కలిసిన కలెక్టర్

హనుమకొండ, జూన్ 18 : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టర్ స్నేహ శబరీశ్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి కలెక్టర్ పూల మొక్క అందజేశారు. సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిశారు.

అంతరించిపోతున్న కళలను బతికించుకుందాం

పరకాల, జూన్ 18 : ఏళ్ల చరిత్ర కలిగిన జానపద కళలను కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పట్టణంలోని ఎఫ్‌జే ఫంక్షన్ హాల్‌లో వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల కళాకారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు ఆటలు, పాటలతో విడదీయలేని బంధం ఉన్నదన్నారు. జానపద కళలు తెలంగాణ ప్రజల కళారుచికి నిదర్శనాలుగా నిలుస్తాయన్నారు. పల్లె ప్రకృతి రమణీయత, శ్రమ, సౌందర్యం, తోటివారిపై ఆప్యాయత కనబరచడం జానపదాల్లో అంతర్లీన అంశాలు అని పేర్కొన్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ, ప్రధాన కార్యదర్శి కోటి, కవిత, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిమ్మల రాజు, దయాకర్, పూర్ణయ్య, సీనియర్ కళాకారులు బండి సమ్మయ్య, శ్రీనివాస్, బర్ల గట్టయ్య పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వేలేరు, జూన్ 18 : అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపారు. పీచరకు చెందిన రాగి సంపత్ చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. బుధవారం పీచరలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా సంతోష్ ఇంట్లో బియ్యం సంచులు కన్పించగా వెంటనే సోదా చేసి 15 బస్తాల్లో నిల్వ చేసిన సుమారు 7.50క్వింటాళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం విలువ రూ. 37,500 ఉంటుందని, సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, జూన్ 18 : యూపీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ, స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకుడు కొంగర జగన్‌మోహన్ కోరారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకుండా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారు http://tsstudycircle.co.in వెబ్ సైట్‌లో ఈ నెల 18 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 13న ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్ ఆధారంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రవేశం కల్పించి 10 నెలల పాటు ఉచిత వసతి, భోజనంతో కూడిన శిక్షణ ఇస్తామన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

పరకాల, జూన్ 18 : సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్నా.. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో మౌలిక సదుపాయ లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణాధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, నాయకులు రవళి, ప్రవళిక, సుజాత, మౌనిక, శ్రావణి పాల్గొన్నారు.

మహిళలకు ర్యాంప్ ప్రోగ్రాంపై అవగాహన

హనుమకొండ, జూన్ 18 : వీ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ హబ్, మినిస్ట్రీ ఆఫ్ ఐటీఈ అండ్ సీ, తెలంగాణ ప్రభుత్వం), డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌సీ, మహిళా పరిశ్రామికవేత్తలకు ర్యాంప్ ప్రోగ్రాం (రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పర్ఫార్మెన్స్ స్కీం)పై మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ మాట్లాడుతూ.. వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ నిధులతో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈఎస్‌లకు బిజినెస్ సపోర్ట్ అందుతుందన్నారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాంలో టెక్స్‌టైల్స్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, హస్తకళలు వంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ డైవర్సిఫికేషన్, బ్రాండింగ్ అండ్ మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్ అందనుందని తెలిపారు. అనంతరం దరఖాస్తులు స్వీకరించారు. డీఆర్‌డీవో శ్రీను, జీఎం ఇండస్ట్రీ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ

భద్రకాళీ అమ్మవారికి బోనాలు

22న బంగారు బోనంతో రానున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్, జూన్ 18 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ అమ్మవారికి బోనాలు చేసే కొత్త సంప్రదాయానికి దేవాదాయ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ నెల 22న రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భద్రకాళీ అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నారు. ఆలయ ఆవరణలో ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు దేవాదాయ శాఖ ఆదేశాలలో సింహవాహిని శ్రీ మహంకాళీ దేవస్థానం, లాల్ దర్వాజ వారు బోనాల పండుగను ఈ ఏడాది భద్రకాళీ ఆలయంలో శ్రీకారం చుట్టుతున్నారని తెలిపారు. అనంతరం భద్రకాళీ అమ్మవారికి బంగారు బోనం బ్యానర్‌ను ఆవిష్కరించారు.

బోనాల సంప్రదాయంపై విమర్శల వెల్లువ..

భద్రకాళీ ఆలయంలో బోనాల పండుగ పేరుతో కొత్త సంప్రదాయానికి తెరలేపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నారు. ఈ సంప్రదాయం ఇప్పటి లేదని పలువురు చెబుతున్నారు. తెలంగాణలో బోనం సమర్పించిన తర్వాత జంతు బలి చేస్తుంటారు. ప్రస్తుతం భద్రకాళీ ఆలయంలో జంతు బలి ఇప్పటి వరకు చేయలేదు. కొత్త పద్ధతితో ఆలయ ప్రాశస్త్యంపై ప్రభావం చూపుతుందని అంటున్నారు.

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్

సుబేదారి, జూన్ 17 : ఇటీవల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయి వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనర్‌లో కలిసి పూలమొక్క అందజేశారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 18 : జూన్ 20న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ యోగా టీచర్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరుగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ప్రముఖ యోగా గురువు, టీవైటీసీసీ ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ పోశాల, శ్రీనివాస్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యోగా సాధకులు నాగిళ్ల, వేణుశర్మ, జయశ్రీ, శ్రీవిద్య, రాజేశ్ పాల్గొన్నారు.

నల్లాల బావి పూడ్చివేత

ఆపాలని గ్రామస్తుల ఆందోళన

ధర్మసాగర్, జూన్ 18 : మల్లక్‌పల్లె గ్రామంలో తాగునీటి బావిని ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సింగారపు రమేశ్, క్వారీ ఓనర్ అజయ్ పూడ్చివేశారు. గ్రామానికి చెందిన పలువురు ఈ బావిని పూడ్చివేయొద్దని పంచాయతీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని ఆందోళన చేశారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి బావిని పూడ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కొరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జూన్ 18 : హనుమకొండ టౌన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడిపికొండ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కడిపికొండ టౌన్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

సైనిక సంక్షేమానికి కేయూ బోధనాసిబ్బంది విరాళం

హనుమకొండ చౌరస్తా, జూన్ 18 : కాకతీయ విశ్వవిద్యాలయ బోధనాసిబ్బంది ఒకరోజు బేసిక్ పే రూ.3,07,610లను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం సమక్షంలో తెలంగాణ రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డైరెక్టర్ కర్నల్ రమేశ్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ రీజినల్ సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ సత్యశ్రీ, రమేశ్‌కుమార్, సుధాకర్, సుమన్ పాల్గొన్నారు.

కొత్తకొండ మార్టులో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

భీమదేవరపల్లి, జూన్, 18 : మండలంలోని కొత్తకొండ గ్రామంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్, బిస్కెట్స్ నిల్వ ఉంచిన వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు ముల్కనూరు ఎస్సై సాయిబాబా తెలిపారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ. 12వేల విలువైన కాలంచెల్లిన శీతల పానీయాలు, రూ. 10వేల విలువైన అంబర్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మార్ట్ ఓనర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూ హాస్టల్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, జూన్ 18 : కాకతీయ విశ్వవిద్యాలయ హాస్టల్ డైరెక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్ పదవీ కాలాన్ని సంవత్సరం పొడిగించారు. వీసీ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం నుంచిరాజ్‌కుమార్ ఉత్తర్వులను అందుకున్నారు.

భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి

హసన్‌పర్తి, జూన్ 18 : భూ సమస్యలు ఉన్న రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో రమేశ్ రాథోడ్ అన్నారు. హసన్‌పర్తిలోని రైతు వేదికలో తహసీల్దార్ చల్లా ప్రసాద్ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రహీం, ఆర్ఐ ఫాజిల్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : బ్రహ్మణపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. 44 మంది రైతుల నుంచి తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు.

ఇల్లు అద్దె పేరుతో పుస్తెలతాడు చోరీ

కమలాపూర్, జూన్ 18 : ఇల్లు అద్దె పేరుతో వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలోని ఉప్పల్‌లో జరిగింది. సీఐ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల మల్లమ్మ–రాయమల్లు దంపతుల ఇల్లు బస్టాండ్ ఎదురుగా ఉన్నది. మూడు రోజులుగా ఇల్లు కిరాయికి కావాలంటూ ఓ వ్యక్తి వీరిని సంప్రదించాడు. ఇంట్లో ఎంతమంది ఉంటారు. నేను టీచర్‌గా పనిచేస్తాను. కిరాయి నెలకు రూ.4వేలు ఇస్తానని చెప్పి రూ.500 బయానా ఇచ్చి నమ్మించాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చి అర్ధరాత్రి 12గంటల వరకు వృద్ధులతో మాట్లాడాడు. మా వాళ్లు సామాన్లు తీసుకొస్తున్నారు. దాహం వేస్తున్నది.. మంచినీళ్లు ఇవ్వమని అడిగాడు. నీళ్లు ఇస్తుండగా మెడలో ఉన్న పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు ఎత్తుకొని పరారయ్యాడు. వృద్ధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అడిషనల్ క్రైం డీసీపీ బోనాల కిషన్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, క్రైం ఏసీపీ సదయ్య బాధితులతో మాట్లాడారు.

ముల్కనూరు సహకార సంఘ ఎన్నికలు ఏకగ్రీవం

భీమదేవరపల్లి, జూన్ 18 : ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం ఐదు డైరెక్టర్ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి కోదండరాములు ప్రకటించారు. బుధవారం సంఘం ప్రధాన కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ పత్రాల ఉపసంహరణ జరిగింది. మొత్తం 15 డైరెక్టర్ స్థానాలుండగా 1,2,5,9,15 స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నెల 16న 1లో అల్లిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, దొంగల చిన్న వెంకట్రాజం, 2లో బొల్లంపల్లి కుమారస్వామి, కడారి ఆదాం, 5లో ఘనవేన శ్రీనివాస్, కూన కనుకయ్య, 9లో గుగ్రాల భాస్కర్‌రెడ్డి, మార్పాటి జయపాల్‌రెడ్డి, బోయినపల్లి రత్నాకర్‌రావు, 15లో కాశీరెడ్డి వసంత, కంకల భాగ్య నామినేషన్ దాఖలు చేశారు. కాగా, దొంగల చిన్న వెంకట్రాజం, కడారి ఆదాం, కూన కనుకయ్య, మార్పాటి జయపాల్‌రెడ్డి, బోయినపల్లి రత్నాకర్‌రావు, కంకల భాగ్య తమ నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. దీంతో అల్లిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బొల్లంపల్లి కుమారస్వామి, ఘనవేన శ్రీనివాస్, గుగ్రాల భాస్కర్‌రెడ్డి, కాశీరెడ్డి వసంత ఏకగ్రీవమైనట్లు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

తూర్పు పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు

చార్జి మెమోలు జారీ చేసిన సీపీ.. 'నమస్తే' ఎఫెక్ట్

సుబేదారి, జూన్ 18 : వరంగల్ తూర్పు నియోజకవర్గ పోలీసు అధికారులకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం చార్జి మెమోలు జారీ చేశారు. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ, వరంగల్ ట్రాఫిక్ నలుగురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు నిబంధనలకు విరుద్ధంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు వారం రోజుల క్రితం ఎస్కార్ట్‌గా వెళ్లారు. దీనిపై శనివారం 'నమస్తే'లో ప్రచురితమైన 'విధులను వదిలి.. కొండాకు ఎస్కార్ట్‌గా వెళ్లి' కథనంపై సీపీ ఆరా తీశారు. విచారణ అనంతరం సీపీ నాలుగు రోజుల క్రితం ఏసీపీ, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలకు సంజాయిషీ ఇవ్వాలని మెమోలు జారీ చేశారు. దీంతో వారు వివరణ విచ్చారు. దీనిపై సంతృప్తి చెందని సీపీ శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వారికి చార్జి మెమోలు జారీ చేశారు.